## క్లుప్తంగా

### ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు సన్మానం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సర్పంచులు

రెబ్బెన: పోడు భూముల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న గిరిజనులకు పోడు పట్టాలు అందేలా కృషి చేసిన ఎమ్మెల్యే ఆత్రం సక్కును బుధవారం మండలానికి చెందిన పలువురు సర్పంచులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచులు చెన్న సోమశేఖర్, బుర్స పోషమల్లు, బీఆర్‌ఎస్ నాయకులు దుర్గం తిరుపతి, విలాస్, గుంపుల విమలేష్, మహిళా మండల అధ్యక్షురాలు అరుణ పాల్గొన్నారు.

### సైబర్ నేరాలపై అవగాహన

కెరమెరి: మండల కేంద్రంలో బుధవారం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్సై నల్లా వెంకటేశ్ మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాలు పెరిగిపోయాయని, సోషల్ మీడియాలో వచ్చే లింక్‌లపై ఎట్టి పరిస్థితుల్లో క్లిక్ చేయవద్దని సూచించారు.

### రాయితీ విత్తనాల పంపిణీ

ఆసిఫాబాద్: మండలంలోని వావుదం, మోతుగూడ గ్రామాల్లో ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ యాదవ్ వ్యవసాయాధికారి ఖాదర్ హుస్సేన్‌తో కలిసి రైతులకు రాయితీపై కంది విత్తనాలు పంపిణీ చేశారు. సింగిల్‌విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్, సర్పంచ్ సువర్ణ, నాయకులు వినోద్, రైతులు పాల్గొన్నారు.

**రుచికరమైన భోజనం అందించాలి**

విద్యార్థులకు విద్యతో పాటు నాణ్యమైన రుచికరమైన భోజనం అందించాలని ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ యాదవ్ అన్నారు. మండలంలోని జ్యోతిబాపూలే బాలికల పాఠశాల, మోతుగూడ ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. సింగిల్‌విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్, ఎంఈవో మనుకుమార్ ఉన్నారు.

### ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలు రద్దు చేయాలి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా పౌర సరఫరాల సంస్థలో గత 15 ఏళ్లుగా పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కార్పొరేషన్ ద్వారా వేతనాలు ఇవ్వాలని ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు మనోహర్, జ్యోతిసుమన్‌లు డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలు రద్దు చేయాలని, ఇతర న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని బుధవారం జిల్లా కేంద్రంలో డీఎం గోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. సురేశ్, మహేష్, అరుణ్, ఉదయ్, రవి తదితరులు పాల్గొన్నారు.

### 'హాస్టళ్ల నిర్వహణ మాకొద్దు'

ఆసిఫాబాద్‌అర్బన్: పెండింగ్ డైట్ చార్జీలను చెల్లించడం లేదని, హాస్టళ్ల నిర్వహణను చూడలేమంటూ ఆశ్రమ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, హెచ్‌డబ్ల్యూవో జేఏసీ తీర్మానించింది. జిల్లా కేంద్రంలో బుధవారం సంఘం నాయకులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ 2022- 23 విద్యా సంవత్సరానికి సంబంధించిన పెండింగ్ డైట్ బిల్లులు చెల్లించాలని గత నెలలో జిల్లా అధికారులకు తెలియజేశామన్నారు. అయినా ఇప్పటివరకు స్పందన రాకపోవడంతో హాస్టల్ నిర్వహణ మాకొద్దని, స్టోరూంల తాళాలను జిల్లా కార్యాలయంలో అందజేశామని తెలిపారు. అనంతరం కలెక్టర్ హేమంత్ బోర్కడేకు వినతిపత్రం అందించారు. జేఏసీ కన్వీనర్ గోపాల్, అశోక్‌కుమార్, స్వర్ణలత పాల్గొన్నారు.

### సాక్షి సినిమాలు

**ఆసిఫాబాద్**

| | |
|---|---|
| కుమురంభీం | : స్పై |

**కాగజ్‌నగర్**

| | |
|---|---|
| వెంకటరమణ | : ఆదిపురుష్ |

- ఆసిఫాబాద్‌అర్బన్

### కూరగాయల ధరలు

| కూరగాయలు | ధర(కిలో) |
|---|---|
| టమాటా | రూ.140 |
| సిమ్లామిర్చి | 100 |
| దోసకాయ | 60 |
| చామగడ్డ | 80 |
| వంకాయ | 60 |
| బీరకాయ | 100 |
| కాకరకాయ | 80 |
| బెండకాయ | 80 |
| అలసంద | 60 |
| దొండకాయ | 80 |
| పచ్చిమిర్చి | 120 |
| పాలకూర | 60 |
| సోరకాయ | 60 |
| చిక్కుడు కాయ | 100 |
| గోబి(పూల్) | 100 |
| క్యాబేజి | 60 |

-ఆసిఫాబాద్‌అర్బన్



తిర్యాణి: సహకార సంఘంలో దొంగలు పగలగొట్టిన బీరువా, డెస్కులు

# దొంగల కలకలం..!

జిల్లా కేంద్రంతో పాటు కాగజ్‌నగర్ పట్టణం, మండల కేంద్రాల్లో వరుస దొంగతనాలు ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్‌గా దొంగలు రెచ్చిపోతున్నారు. తాళాలు పగలగొట్టి విలువైన వస్తువులు, బంగారం, వెండి, నగదు దోచుకెళ్తున్నారు. పోలీసులు పెట్రోలింగ్, తనిఖీలు, కార్డెన్‌సెర్చ్‌లు కొనసాగిస్తున్నా చోరీలకు పాల్పడుతూ దొంగలు పోలీసులకు సవాల్ విసురుతున్నారు.

– కౌటాల

- జిల్లాలో వరుస చోరీ ఘటనలు
- తాజాగా కౌటాల ఎంపీడీవో కార్యాలయంలో..
- అప్రమత్తంగా ఉండాలని పోలీసుల సూచన

**సరిహద్దు ముప్పు..**

కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్ మండలాలకు మహారాష్ట్ర సరిహద్దుగా ఉండటంతో రైలు, రోడ్డు మార్గాల ద్వారా దొంగలు సులువుగా తప్పించుకుంటున్నారు. పోలీసులు వాణిజ్య సముదాయాలు, ముఖ్యమైన ప్రాంతాలు, రద్దీ ఏరియాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కానీ వాటి నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో పలు సీసీ కెమెరాలు నిరుపయోగంగా మారాయి. దీంతో పోలీసులకు దొంగలు చిక్కడం లేదు. కాగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. ఇంట్లో అందరూ శుభకార్యాలకు, ఇతర ప్రాంతాలకు వెళ్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పేర్కొంటున్నారు.

**రికవరీ తక్కువే..**

జిల్లాలో జరిగిన చోరీ ఘటనల్లో పెద్ద ఎత్తున నగదు, బంగారం, వెండి ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. దొంగలు పగటి వేళల్లో కాలనీల్లో తిరుగుతూ తాళాలు వేసి ఉన్న ఇళ్లను గుర్తిస్తున్నారు. రాత్రి వేళల్లో తాళాలు పగులగొట్టి దొంగతనాలకు పాల్పడుతున్నారు. జిల్లాలో గత రెండేళ్లల్లో 131 దొంగతనాలు జరిగాయి. మొత్తం రూ.1.51 కోట్ల విలువ గల సొమ్ము చోరీకి గురైంది. ఇప్పటివరకు 110 దొంగతనాల కేసులు పరిష్కారం కాని కేసులుగా ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. వారిని పట్టుకొని సొమ్ము రికవరీ చేయడంలో పోలీసులు విఫలమవుతున్నారనే ఆరోపణలున్నాయి.

**ఇటీవల జరిగిన పలు చోరీలు..**

- జూన్ 21వ తేదీ రాత్రి కాగజ్‌నగర్ పట్టణం న్యూకాలనీలో ఎస్పీఎం రెండు క్వార్టర్లలో దొంగతనం జరిగింది. కార్మికులు మల్లేశ్, రవీందర్ రాత్రి షిప్టు విధుల్లోకి వెళ్లగా ఇంట్లో ఎవరూలేని సమయంలో దొంగలు చొరబడి మల్లేశ్ ఇంట్లో 40 తులాల వెండి ఆభరణాలతో పాటు రూ.2వేలు నగదు ఎత్తుకెళ్లారు. రవీందర్ ఇంట్లో తులం బంగారంతో పాటు రూ.84 వేల నగదు దొంగిలించారు.
- జూన్ 26 రాత్రి కాగజ్‌నగర్ పట్టణంలోని రాజీవ్‌గాంధీ చౌరస్తాలో ఓ ఏటీఎం, నాలుగు దుకాణాల్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు. ఓ దుకాణంలో రూ.5 వేలు దొంగిలించారు.
- జూన్ 27 రాత్రి తిర్యాణి మండల కేంద్రంలోని సహకార బ్యాంకులో చోరీకి యత్నించి సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. అదేరోజు రాత్రి తిర్యాణికి చెందిన సకారం ఇంట్లో రెండు తులాల బంగారంతో పాటు రూ.12 వేలు చోరీ చేశారు.
- ఈ నెల 2న కౌటాల ఎంపీడీవో కార్యాలయంలో దొంగలు పడి రూ.50 వేల విలువ గల 5 బ్యాటరీలను ఎత్తుకెళ్లారు. అధికారులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

**బ్యాటరీలు దొంగిలించారు**

మా కార్యాలయంలో ఈనెల 2న రాత్రి దొంగలు పడి కార్యాలయంలోని ఈజీఎస్ కంప్యూటర్ గదిలో ఉన్న ఐదు బ్యాటరీలు ఎత్తుకెళ్లారు. వాటి విలువ రూ.50 వేల వరకు ఉంటుంది. మరునటి రోజు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. – నస్రుల్లాఖాన్, ఎంపీడీవో, కౌటాల

# డబుల్ రోడ్డుకు నిధులు

- రూ.32 కోట్లు మంజూరు చేస్తున్నట్లు సీఎం ప్రకటన
- దహెగాం నుంచి కోత్మీర్‌కు సింగిల్ రోడ్డుతో ఇబ్బందులు
- తీరనున్న ప్రయాణ కష్టాలు



దహెగాం నుంచి కోత్మీర్ వరకు ఉన్న రోడ్డు

దహెగాం: మండల కేంద్రం నుంచి మండలంలోని కోత్మీర్ వరకు డబుల్ రోడ్డు నిర్మించనున్నారు. ఈమేరకు సీఎం కేసీఆర్ ఇటీవల జిల్లా పర్యటనలో భాగంగా డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.32 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. సింగిల్ రోడ్డుతో నానా ఇబ్బందులు పడ్డ మండలవాసులు డబుల్ రోడ్డుకు నిధులు మంజూరు కావడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**నిత్యం కాగజ్‌నగర్‌కు రాకపోకలు..**

మండల వాసులకు ఏ అవసరమున్నా కాగజ్‌నగర్‌కు వెళ్తుంటారు. మండల కేంద్రం నుంచి కాగజ్‌నగర్‌కు 30 కిలోమీటర్ల దూరం ఉంది. గతంలోనే కాగజ్‌నగర్ నుంచి మండలంలోని కోత్మీర్ వరకు డబుల్ రోడ్డు నిర్మించారు. కోత్మీర్ నుంచి మండల కేంద్రం వరకు 13 కిలోమీటర్ల మేర సింగిల్ రోడ్డు ఉండడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. సింగిల్ రోడ్డుపై ప్రమాదకరంగా మూలమలుపులు ఉన్నాయి. మూలమలుపుల వద్ద ఆర్‌అండ్‌బీ శాఖ ఎలాంటి ప్రమాద సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. ప్రమాదకర మూలమలుపులతో మండలానికి ఆర్టీసీ సేవలు కూడా దూరమయ్యాయి. దీంతో ప్రజలు ప్రైవేటు ఆటోలలో అధిక చార్జీలు వెచ్చించి ప్రయాణిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో డబుల్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో ఇబ్బందులు తప్పుతాయని స్థానికులు పేర్కొంటున్నారు. కాగా వర్షాకాలం ముగిసిన తరువాత రోడ్డు పనులు ప్రారంభించనున్నారు. బీబ్రా గ్రామం వద్ద కోతకు గురైన రోడ్డు వద్ద వంతెన నిర్మాణం కూడా చేపట్టనున్నారు.

**కొనసాగుతున్న వంతెన నిర్మాణం..**

గత సంవత్సరం భారీ వరదల కారణంగా పెద్దవాగు ఉప్పొంగడంతో కాగజ్‌నగర్ మండలంలోని అందవెల్లి పెద్దవాగుపై ఉన్న వంతెన కూలిపోయింది. దీంతో వంతెన నిర్మాణ పనులు కొనసాగుతుండగా వాగులో తాత్కాలిక రోడ్డు వేసి రాకపోకలు సాగిస్తున్నారు. వర్షాలు కురిస్తే వాగులోని తాత్కాలిక రోడ్డు తెగిపోయే ప్రమాదం ఉంది. దీంతో రాకపోకలు నిలిచిపోతాయి. మండల వాసులు కాగజ్‌నగర్ వెళ్లాలంటే పెంచికల్‌పేట్ మీదుగా వెళ్లాల్సిన పరిస్థితి ఉంటుంది. డబుల్ రోడ్డు, వంతెన నిర్మాణం పూర్తయితే ఏన్నో ఏళ్లుగా మండల వాసులు పడుతున్న కష్టాలు తీరనున్నాయి.

**తిప్పలు తప్పుతాయి**



ఏన్నో ఏళ్లుగా సింగిల్ రోడ్డుతో ఇబ్బందులు పడుతున్నాం. దహెగాం నుంచి కాగజ్‌నగర్‌కు వెళ్లాలంటే కోత్మీర్ వరకు సింగిల్ రోడ్డు ఉంది. ఐనం గ్రామంలో ప్రమాదకరంగా మూలమలుపులు ఉన్నాయి. డబుల్ రోడ్డు నిర్మిస్తే తిప్పలు తప్పుతాయి.

- నాయికిని సత్యనారాయణ, ఆటోడ్రైవర్

**వంతెన పూర్తి చేయాలి**



అందవెల్లి పెద్దవాగుపై వంతెన పనులు త్వరగా పూర్తి చేయాలి. వాగు ఉప్పొంగితే తాత్కాలిక రోడ్డు తెగిపోతుంది. దీంతో మేం కాగజ్‌నగర్‌కు వెళ్లడం ఇబ్బంది అవుతుంది. వంతెన పూర్తయితేనే కష్టాలు తీరుతాయి.

- తలాండి హన్మంతు, ప్రయాణికుడు

# విద్యార్థులకు నోట్‌పుస్తకాల పంపిణీ



నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న కంపెనీ ప్రతినిధులు

కౌటాల: మండలంలోని గుండాయిపేట గ్రామంలో గల జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు బుధవారం మహీంద్ర ట్రాక్టర్స్, ఆదర్శ ఆటోమేటివ్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఉచితంగా నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం హన్మంతు, సభ్యులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం మహీంద్ర ట్రాక్టర్స్ ఆదర్శ ఆటోమేటివ్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఉచితంగా నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. జెడ్పీఎస్‌ఎస్ పాఠశాలకు చెందిన ఉర్దూ మీడియం, తెలుగు మీడియం 176 మంది విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యుడు కిజర్‌హుస్సేన్, ఉపసర్పంచ్ తోట మహేష్, వార్డు సభ్యులు ఇఫాత్‌హుస్సేన్, నాయకులు, చునార్కర్ ఉమాజి, ప్రధానోపాధ్యాయుడు దేవాజి, ఉపాధ్యాయులు లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ బిల్లులు చెల్లించాలి



దరఖాస్తులు పరిశీలిస్తున్న అధికారులు

కౌటాల: విద్యుత్ వినియోగదారులు సకాలంలో బిల్లులు చెల్లించాలని విద్యుత్‌శాఖ డీఈ రాజశేఖర్ అన్నారు. బుధవారం కౌటాల విద్యుత్ కార్యాలయంలో విద్యుత్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా 40 మంది విద్యుత్ వినియోగదారుల దరఖాస్తులను అధికారులు పరిశీలించారు. అధిక బిల్లుల సమస్య ఉన్న వాటిలో కొన్నింటిని పరిష్కరించారు. పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని తెలిపారు. పొదుపుగా విద్యుత్ వినియోగించాలని, విద్యుత్ సమస్యలుంటే అధికారులను సంప్రదించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యుత్ ఏఈ ఈశ్వర్, ఏఏవో తుకారం, ఏఈలు రవీందర్, ఇర్ఫాన్, అంజల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సమ్మె పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కెరమెరి: గ్రామ పంచాయతీ సిబ్బంది ఈ నెల 6న నిర్వహించనున్న రాష్ట్రవ్యాప్త సమ్మె పోస్టర్‌ను ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గడ్డల వెంకటేశ్ బుధవారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సిబ్బందిని క్రమబద్ధీకరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్మికులు శంకర్, నరేశ్, సంతోష్ తదితరులు ఉన్నారు.

**రెబ్బెనలో..**

రెబ్బెన: పంచాయతీ కార్మికుల డిమాండ్ల సాధన కోసం జేఏసీ ఆధ్వర్యంలో గురువారం నుంచి నిర్వహించ తలపెట్టిన నిరవధిక సమ్మెకు సంబంధించిన నోటీసులను బుధవారం జేఏసీ ఆధ్వర్యంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు ఆయా గ్రామాల పంచాయతీ కార్మికులు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్, నాయకులు వెంకటేష్, సుధాకర్, రమేశ్, శంకర్, దేవాజీ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

### పీఆర్‌సీ కమిషన్ వెంటనే ఏర్పాటు చేయాలి




సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఉపాధ్యాయులు

సిర్పూర్(టి): ఉద్యోగ, ఉపాధ్యాయుల వేతనాలు పెంచేందుకు వెంటనే పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతికుమారి అన్నారు. బుధవారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో టీఎస్‌యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరీష్, రాజ్‌కుమార్, నాయకులు వంశీ, సంతోష్‌గౌడ్, కృష్ణ, ఫ్రాన్సిస్, రవి, మునీందర్, పద్మ, హరిత పాల్గొన్నారు.

### నేడు క్రీడా పాఠశాలల ఎంపిక పోటీలు

కౌటాల: క్రీడా పాఠశాలల మండలస్థాయి ఎంపిక పోటీలను గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో గల మైదానంలో నిర్వహించనున్నట్లు పీఈటీలు హరీష్, హరికృష్ణ బుధవారం తెలిపారు. నేడు ఉదయం 10 గంటలకు పోటీలు నిర్వహిస్తామని, మండలంలోని 4, 5వ తరగతులు చదువుతున్న బాలబాలికలు హాజరు కావాలని సూచించారు. వివరాలకు 9581583836లో సంప్రదించాలని కోరారు.

**10న నవోదయ విద్యాలయంలో..**

కాగజ్‌నగర్‌టౌన్: తెలంగాణ రాష్ట్ర క్రీడా పాఠశాలల్లో 4, 5వ తరగతుల్లో ప్రవేశాల కోసం కాగజ్‌నగర్ మండలస్థాయి విద్యార్థుల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈవో బిక్షపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10న జవహర్ నవోదయ విద్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి పోటీలు ఉంటాయన్నారు.

# పోడు రైతులకు పట్టాల పంపిణీ



దహెగాం: పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోనప్ప

దహెగాం: మండల కేంద్రంలోని రైతువేదికలో బుధవారం ఎమ్మెల్యే కోనేరు కోనప్ప గిరిజన రైతులకు పోడు పట్టాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ జల్ -జంగల్ -జమీన్ అనే నినాదంతో పోరాడిన కుమురం భీం ఆశయాలను సీఎం కేసీఆర్ నెరవేరుస్తున్నారని ఆయన పేర్కొన్నారు. మండలంలో 526 మంది లబ్ధిదారులకు, 1276 ఎకరాల భూమికి సంబంధించిన పట్టాలు అందించినట్లు పేర్కొన్నారు. పోడు పట్టాలు పొందిన వారికి మూడు రోజుల్లో రైతుబంధు సాయం కూడా అందిస్తామని తెలిపారు. కుంచవెల్లి నుంచి బ్రహ్మన్‌చిచ్యాల వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని, జెండాగూడ వద్ద వంతెన, దుబ్బగూడకు రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. జిల్లా రైతు బంధు సమితీ అధ్యక్షుడు జగ్గాగౌడ్, జెడ్పీటీసీ రామారావు, మండల రైతు బంధు సమన్వయ సమితీ కన్వీనర్ సంతోష్‌గౌడ్, వైస్ ఎంపీపీ సురేశ్, సర్పంచ్ పుప్పాల లక్ష్మి, ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

**కౌటాలలో..**



కౌటాల: పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

కౌటాల: రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో రైతులకు పోడు పట్టాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పోడు రైతులకు పట్టాలు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. మండలంలో 141 మంది రైతులకు పోడు పట్టాలు అందించినట్లు తెలిపారు. రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు జగ్గాగౌడ్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య, ఎంపీపీలు బసర్కార్ విశ్వనాథ్, నానయ్య, రైతుబంధు సమితి మండల కన్వీనర్ మెర్పల్లి బ్రహ్మయ్య, సర్పంచులు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వసంత్‌రావ్, యూత్ మండల అధ్యక్షుడు రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

**పెంచికల్‌పేట్‌లో..**



పెంచికల్‌పేట్: పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని రైతువేదికలో బుధవారం ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పోడు రైతులకు పట్టాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ఏళ్లుగా సాగు చేసుకుంటున్న గిరిజన రైతులకు పట్టాలు పంపిణీ చేశామన్నారు. రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు కొంద్ర జగ్గాగౌడ్, తహసీల్దార్ సరిత, ఎంపీడీవో గంగాసింగ్, ఏవో రాజులనాయుడు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చౌదరి తిరుపతి, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

**బెజ్జూర్‌లో..**



బెజ్జూర్‌లో..

బెజ్జూర్: ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న గిరిజన పోడు రైతుల కలను సీఎం కేసీఆర్ నెరవేర్చారని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎస్‌వీ ఫంక్షన్‌హాల్‌లో పోడు భూముల పట్టాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పోడు భూముల కోసం తమ కుటుంబం జైలుకెళ్లిందని గుర్తు చేసుకున్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి పట్టాలు అందజేస్తామని పేర్కొన్నారు. మండలంలో 1,297 మంది పోడు రైతులకు 5500 ఎకరాలకు సంబంధించిన పట్టాలు అందజేసినట్లు తెలిపారు. రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు కొంద్ర జగ్గాగౌడ్, జెడ్పీటీసీ పుష్పలత, పీఏసీఎస్ చైర్మన్ ఓంప్రకాష్, తహసీల్దార్ శ్రీపాల్, ఎంపీడీవో మాధవి, ఎంపీవో రమేష్ రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు బషారత్ ఖాన్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

### పద్మశాలీ సంఘం సమావేశం

కాగజ్‌నగర్‌టౌన్: జిల్లా పద్మశాలీ సంఘం కార్యవర్గం ఎన్నికల నిర్వహణపై చర్చించేందుకు జిల్లాలోని ఆయా మండలాల అధ్యక్ష, కార్యదర్శులతో బుధవారం సమావేశం నిర్వహించారు. పద్మశాలీ సంఘ జాతీయ, రాష్ట్ర అధ్యక్షులు కందగట్ల స్వామి, మచ్చ ప్రభాకర్ రావుల ఆదేశాల మేరకు కాగజ్‌నగర్ పట్టణంలోని పద్మశాలీ సంఘంభవనంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్ల కనకయ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.

# మెనూ ప్రకారం భోజనం అందించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

కౌటాల: ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని ఏబీవీపీ నాయకులు బుధవారం స్థానిక విద్యావనరుల కేంద్రంలో ఎంఈవో డి. సోమయ్యకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని ఆరోపించారు. కౌటాల జెడ్పీ పాఠశాలలో గత 20 రోజుల నుంచి కోడిగుడ్లు పెట్టడం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు రవితేజ, నవీన్, అంజన్న, మహేష్, శ్రీకాంత్ తిరుమల్, తదితరులు పాల్గొన్నారు.

### సబ్సిడీ డబ్బులు అందేలా చూడాలని వినతి

రెబ్బెన: వికలాంగుల కోటా కింద మంజూరైన రుణంలో ప్రభుత్వం అందించిన సబ్సిడీ డబ్బులు అందేలా కృషి చేయాలని మండల కేంద్రానికి చెందిన దివ్యాంగుడు లింగంపల్లి ప్రశాంత్‌గౌడ్ కోరారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆత్రం సక్కును కలిసి వినతిపత్రం అందజేశారు.

### గుండెపోటుతో మున్సిపల్ చైర్మన్ తండ్రి మృతి

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్ తండ్రి అహ్మద్ హుస్సేన్ (85) బుధవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. ఆరోగ్య పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్తుండగా పెద్దపల్లిలో గుండెపోటు వచ్చింది. స్థానిక ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారని కుటుంబసభ్యులు తెలిపారు.